# రైతు వేదికలతో ఎంతో ప్రయోజనం



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

● ఉద్యాన కళాశాల విద్యార్థులు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబర్ 30 : తెలంగాణ ప్రభుత్వం ప్రతి క్లస్టర్ గ్రామంలో నిర్మించిన రైతు వేదికలు రైతులకు ఎంతో ఉపయోగకరమని కొండాలక్ష్మణ్‌బాపూజీ ఉద్యానవన కళాశాల విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కోర్సు శిక్షణలో భాగంగా మండలంలోని అంగడిపేట రైతు వేదికలలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పంటల సాగుపై వ్యవసాయాధికారులతో కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ పాండు, ఏఈఓ జ్యోతి, సౌమ్య, విద్యార్థులు భరత్, అఖిల్, అమిత్, అభిరామ్, తరుణ్‌రెడ్డి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి

పెద్దవూర, అక్టోబర్30 : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ నుంచి అధిక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నాయనవానికుంట గ్రామానికి చెందిన 50 కాంగ్రెస్ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కృష్ణారెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో జానపాటి రాంబాబు, చిమట శివ, చిమట శ్రీనివాస్, మేకల లింగయ్య, కొట్టె మల్లేశ్, జానపాటి చినరాంబాబు, కార్యకర్తలు ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవి నాయక్, ప్రధాన కార్యదర్శి మునిరెడ్డి, నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, బోయ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న హమాలీలు

# అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే హమాలీల మద్దతు

● ఏకగ్రీవ తీర్మానం

బొడ్రాయిబజార్, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ వెంటే తాము ఉంటామని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయలక్ష్మి పార్‌బాయిల్డ్‌కు చెందిన హమాలీలు సోమవారం బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గురూజీ మాట్లాడుతూ హమాలీల హక్కుల సాధనలో బీఆర్‌టీయూ రాజీ లేకుండా పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైస్ ఇండస్ట్రీస్ షెడ్యూల్ జాబితాలో చేర్చాలని, హమాలీలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అసంఘటిత రంగంలో పని చేస్తున్న హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట నియోజకవర్గ అభివృద్ధికి, కార్మిక సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డిని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకవర్గం ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో హమాలీలు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



బీఆర్ఎస్‌లో చేరిన జిల్లపల్లి సర్పంచ్ వెంకటయ్యకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి

దేవరకొండ, అక్టోబర్ 30 : దేవరకొండ పట్టణంలో మంగళవారం జరిగే ప్రజా ఆశీర్వాద సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు సమీపంలోని మైదానంలో జరిగే సీఎం కేసీఆర్ సభకు నియోజకవర్గ నుంచి 80 వేల మంది హాజరు కానున్నట్లు చెప్పారు. కొంత మంది నాయకులు తమ స్వార్థం కోసం ఇతర పార్టీల్లో చేరినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రహత్‌అలీ, కౌన్సిలర్ వీరమోని అంజిగౌడ్, నీల రవికుమార్, పొన్నబోయిన సైదులు, మహ్మద్ రైస్, జయప్రకాశ్‌నారాయణ, తౌఫిక్‌ఖాద్రి, ఉప్పల శ్రీను, సత్తార్, ఇలియాస్, జయలక్ష్మి, సత్యనారాయణ ఉన్నారు.

### సంక్షేమ పథకాలు చూసే బీఆర్ఎస్‌లోకి

దేవరకొండ : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ చేరుతున్నారని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలం జటావత్ తండాకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఏం చేశారని ఓట్లు వేయాలో ఆ పార్టీ నాయకులను నిలదీయాలని సూచించారు. దేవరకొండ ఖిలాపై మరోమారు గులాబీ జెండా ఎగుర వేసేందుకు పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. జడ్పీటీసీ సలహాదారుడు మారుపాకుల సురేశ్‌గౌడ్, ఎంపీటీసీ బద్యానాయక్, నాయకులు ఎరుకలి యాదయ్య, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్ సభకు తరలి రావాలి

పెద్దఅడిశర్లపల్లి: దేవరకొండలో మంగళవారం జరిగే సీఎం కేసీఆర్ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం సభకు మండలం నుంచి సుమారు 10వేల మంది బయలుదేరి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

### సొంతగూటికి చేరిన జిల్లపల్లి సర్పంచ్

దేవరకొండ : కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెప్పి తమ పార్టీలో చేర్చుకున్న మండలంలోని జిల్లపల్లి సర్పంచ్ ఎటెల్లి వెంకటయ్యతో పాటు మరో 20 మంది సోమవారం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది నాయకులు తమ స్వలాభం కోసం ఇతర పార్టీల్లోకి వెళ్లి బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మి ఎవరూ మోస పోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కృష్ణపట్టెకు జల నేత కేసీఆర్

● హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో బహిరంగ సభలు

● ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

● సభలకు ఏర్పాట్లు పూర్తి.. భారీగా తరలొచ్చేందుకు జనం సంసిద్ధం

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు హుజూర్‌నగర్‌కు చేరుకోనున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గుట్టకు వెళ్లే మార్గంలోని విశాలమైన స్థలంలో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో వారం రోజులుగా సభా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సైదిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరుగనున్న సభ కావడంతో సభికులకు అవసరమైన మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు సైతం విస్తృతంగా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా పట్టణం నలువైపులా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ సభా అనంతరం హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ మిర్యాలగూడకు పయనం అవుతారు.

### మిర్యాలగూడ ఎన్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో...

మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు మైదానంలో ఏర్పాట్లు చేశారు. హుజూర్‌నగర్ నుంచి సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మిర్యాలగూడకు చేరుకుంటారు. పక్కనే కొద్ది దూరంలోనే హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. సీఎం రాక కోసం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చే ప్రజలు సులువుగా చేరుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పట్టణానికి నలువైపులా సభా స్థలానికి కొద్ది దూరంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసి కాలినడకన సభా ప్రాంగణానికి ప్రజలు చేరుకోవాల్సి ఉంటుంది. సభా ప్రాంగణంలోనూ మంచినీరు, మజ్జిగ లాంటి అన్ని చర్యలు చేపడుతున్నారు. సభకు వచ్చే వీవీపీలు, మీడియా, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలకు ఇలా వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే భాస్కర్‌రావు వెల్లడించారు.

### దేవరకొండలోని ముదిగొండ రోడ్డులో..

దేవరకొండ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పట్టణంలోని ముదిగొండ రోడ్డులో విశాలమైన స్థలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ మిర్యాలగూడ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 3.30గంటల సమయంలో దేవరకొండకు చేరుకోనున్నారు. సభాస్థలికి సమీపంలోనే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొన్నారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు చేపట్టారు. 2018 ఎన్నికల సమయంలోనూ ఇదే స్థలంలో సీఎం కేసీఆర్ సభ నిర్వహించారు. సభకు వేలాదిగా జనం తరలివచ్చే అవకాశాలు ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే రవీంద్రకుమార్ స్వయంగా దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభా స్థలంలోనే ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు మంచినీరు, ఇతర సౌకర్యాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ రాక కోసం సర్వం సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రకటించారు.

### పోటెత్తుతున్న జనం

ఉమ్మడి జిల్లా పరిధిలో జరుగుతున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలకు జనం తండోపతండాలుగా తరలొస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభలకు జనం పోటెత్తారు. ఏ సభలో చూసినా భారీ జన సందోహం కనిపించింది. ఆయా నియోజకవర్గాల నలుమూలల నుంచి చిన్నా పెద్దా, ముసలి ముతక, ఆడ మగ తేడా లేకుండా సభకు తరలివస్తుండడంతో అన్ని చోట్ల జన జాతర్లను తలపించాయి. ఊహించిన దాని కంటే రెట్టింపు సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ పథకాల లబ్ధిదారులు, సామాన్య ప్రజలు సభలకు వచ్చి కేసీఆర్ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారు. అన్ని చోట్ల కేసీఆర్ ప్రసంగాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇక నేడు జరుగనున్న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ సభలకు సైతం వేలాదిగా తరలివచ్చేందుకు జనం సన్నద్ధం కావడం విశేషం. సీఎం కేసీఆర్ సభలకు వస్తున్న స్పందనను చూస్తుంటే ఉమ్మడి జిల్లాలో మరోసారి అన్నిస్థానాల్లో గులాబీ జెండా కు ఎదురుండదన్న చర్చ జోరుగా సాగుతోంది.